
సాక్షి చిత్తూరు

శనివారం । 19 । ఆగస్టు । 2023



ధ్వజస్తంభానికి బాలాలయం

కాణిపాకం వినాయకస్వామి వారి ఆలయంలో ధ్వజస్తంభానికి శుక్రవారం శాస్త్రోక్తంగా బాలాలయం ఏర్పాటు చేశారు. - IIలో



ఉద్యోగుల సమస్యలకు ప్రాధాన్యం

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. - IIలో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	36	25
తిరుపతి	37	26
తిరుమల	32	21
గూడూరు	38	28
నగరి	37	26

న్యూస్‌రీల్

బోయకొండలో శ్రావణ సందడి



విశేషాలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీబోయ కొండ గంగమ్మ ఆలయంలో నిజ శ్రావణ మాస సందడి నెలకొంది. మొదటి శుక్రవారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం 10–30 నుంచి 12 గంటల వరకు రాహుకాల సమయంలో ప్రత్యేక అభిషేక పూజలను వేదోక్తంగా నిర్వహించారు. ఈ పూజల్లో 85 జంటలు పాల్గొన్నాయి. అనంతరం సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో భక్తులకు పవిత్ర తీర్థప్రసాదాలు అందజేయగా, వేదపండితులు ఆశీర్వదించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా



దుర్గసముద్రం ఉపకేంద్రంలో సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తున్న ఎస్‌ఈ కృష్ణారెడ్డి

చౌడేపల్లె: వ్యవసాయానికి, గృహ వినియోగానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకే మండలంలో మూడు ప్రాంతాల్లో అదనపు విద్యుత్ ఉప కేంద్రాలు ఏర్పాటు చేశామని ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని దుర్గసముద్రం, బిల్లేరులో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ఉప కేంద్రాల్లో ఆయన సాంకేతిక పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో కొండామర్రి, దుర్గసముద్రం, బిల్లేరు వద్ద ఒక్కో ఉప కేంద్రాన్ని రూ.3.80 కోట్లతో నిర్మించినట్లు తెలిపారు. సాంకేతిక పరీక్షలు చేశామని త్వరలో మంత్రి పెద్దిరెడ్డిచే ప్రారంభోత్సవాలకు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. లోఓల్టేజీ నివారణకు కూడా అవసరమైన చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఈకార్యక్రమంలో ఈఈ విజయన్, డిప్యూటీ ఈఈ రవి, ఇన్‌చార్జి ఏఈ సంతోష్, సర్పంచ్ సరస్వతమ్మ, కాంట్రాక్టర్ మయూరి రవి, నేతలు చెంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పసికందుపై కమిషనర్ ఆరా

చిత్తూరు రూరల్: చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రెండు రోజుల కిందట బాత్‌రూమ్‌లో ఓ గర్భిణి బిడ్డను ప్రసవించి వదిలి వెళ్లిన ఘటనపై శుక్రవారం ఏపీవీపీ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆరా తీశారు. ఘటన జరిగి మూడు రోజులు అవుతున్నా ఆస్పత్రి అధికారులు విచారణ చేసి పసికందు తల్లి ఎవరనే విషయం తేల్చలేక పోతున్నారు. బాత్‌రూమ్‌లో ప్రసవం ఎలా జరిగింది..సీసీ కెమెరాలున్నా విచారణ ముందుకు సాగని విషయమై ఆరోపణలు వచ్చాయి. దీనిపై శుక్రవారం 'సాక్షి'లో 'ఇంతకూ ఆ తల్లి ఎవరు?' శీర్షికన ప్రచురితమైన కథనంపై కమిషనర్ స్పందించారు. ఘటనపై డీసీహెచ్‌ఎస్ బీఎస్‌కే నాయక్‌తో ఆయన చర్చించారు. ఆ తల్లి ఎవరంటూ ప్రశ్నించారు. లోతుగా విచారించి వెంటనే నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు.

సీఎం సభకు ఏర్పాట్లు ముమ్మరం



నగరి : పట్టణంలో ఈనెల 28న జగనన్న విద్యాదీవెన పథకం ప్రారంభానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేయనుండడంతో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. శుక్రవారం సభావేదిక ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. మున్సిపల్ పరిధి ఏపీ టూరిజం భవనానికి సమీపంలో సభ నిర్వహణకు అధికారులు స్థలం ఎంపిక చేశారు. సభాస్థలి వద్ద చదును చేసే పనులను అధికారులు వేగంగా నిర్వహిస్తున్నారు.

మార్గదర్శిలో కొనసాగుతున్న దాడులు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరులోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయంలో సీఐడీ పర్యవేక్షణలో శుక్రవారం రెండో రోజు దాడులు కొనసాగాయి. ఉదయం నుంచి రిజిస్ట్రేషన్ అధికారులు ఇక్కడ జరిగిన లావాదేవీల వివరాలను పరిశీలించారు. చిట్స్ గ్రూప్‌ల వారీగా వివరాలను తీసుకొని వినియోగదారులకు చిట్స్ మొత్తం ఇస్తున్నారా లేదా, నగదును ఎలా ఇస్తున్నారు?..అకౌంట్స్ నిర్వహణ తదితర అంశాలపై ఆరాతీశారు.



కాలినడక మార్గంలో సెక్యూరిటీ నడుమ వెళుతున్న భక్త బృందం

గోవింద స్మరణే శ్రీరామరక్ష

కోటి జన్మల పుణ్యఫలంతోనే దేవదేవుని దర్శనం సాధ్యమని భక్తుల నమ్మకం.. సప్తగిరులపై స్వయంభువుగా వెలసిన శ్రీనివాసుని కరచరణాల వీక్షణతో సకల పాపాలు నశిస్తాయని విశ్వాసం.. కలియుగ వైకుంఠంగా అలరారుతున్న తిరుమల క్షేత్రానికి చేరుకుంటే.. సాక్షాత్తూ శ్రీమహావిష్ణువుని సేవించుకున్నట్టే అని పురాణాల్లో పేర్కొన్నారు. అందుకే తిరుగిరులను అధిరోహించేందుకు నిత్యం పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. జీవితంలో ఒక్కసారైనా కాలినడకన శ్రీవారి సన్నిధికి చేరుకునేందుకు పరితపిస్తుంటారు. దట్టమైన అటవీమార్గంలో ముందుకు సాగుతూ.. గోవిందనామ స్మరణ చేస్తూ పులకిస్తుంటారు. ఈ క్రమంలో వన్యమృగాల సంచారం అధికమైన నేపథ్యంలో భక్తుల రక్షణకు టీటీడీ నడుంబిగించింది. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేపట్టింది. పలు నిబంధనలను పకడ్బందీగా అమలు చేస్తోంది. అందులో భాగంగా భక్తులకు చేతికర్రను సైతం అందించాలని నిర్ణయించింది.

- తిరుమల కాలినడక మార్గంలో భద్రత కట్టుదిట్టం
- తప్పెట్లు, తాళాలతో భజన చేయడం శ్రేయస్కరం
- చేతికర్ర సాయానికి శాస్త్రీయ కారణం
- డేంజర్ జోన్‌లపై పకడ్బందీ నిఘా
- చిరుతల కోసం నిరంతరం అన్వేషణ

సాక్షి, తిరుపతి : తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులు తప్పనిసరిగా కొన్ని నియమాలు, నిబంధనలు పాటించాలని టీటీడీ సూచిస్తోంది. వాటిని అమలు చేస్తే ముక్తితో పాటు ప్రాణాలకు రక్షణ కవచంలా నిలుస్తాయని తెలియజేస్తోంది. ప్రపంచం నలుమూలల నిత్యం ఏడుకొండల స్వామిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు విచ్చేస్తుంటారు. అందులో బస్సులు, ఇతర వాహనాల్లో ఘాట్ రోడ్డు మీదుగా తిరుమల చేరుకునేవారు కొందరైతే.. కాలినడక మార్గం నుంచి కలియుగ వైకుంఠానికి చేరుకునే వారు మరి కొందరు. అయితే తిరుమల చరిత్రలో ఎన్నడూ జరగని ఘటన ఇటీవల నడకమార్గంలో చోటు చేసుకుంది. నడకదారిలో చిన్నారిపై చిరుత దాడిచేసి ప్రాణాలు బలితీసుకున్న విషయం తెలిసిందే. చిన్నారి మృత్యువాత పడడంతో భక్తుల తక్షణ రక్షణకు టీటీడీ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా కాలినడక మార్గంలో రాకపోకలు సాగించే భక్తులకు చేతి కర్ర ఇవ్వాలని సంకల్పించింది. దీనిపై సోషల్ మీడియాలో కొందరు దుష్ప్రచారం చేయడాన్ని భక్తులు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు.



అలిపిరి కాలిబాటలో వెళుతున్న భక్తులు

అడవిలోకి వెళ్లకూడదు

గతంలో నడక మార్గంలో వెళ్లే భక్తులు గుంపులు గుంపులుగా తప్పెట్లు.. తాళాలతో గోవింద నామ స్మరణ చేస్తూ, భక్తి పాటలు పాడుకుంటూ తిరుమలకు వచ్చేవారు. ఇప్పుడు భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగినా.. భజన చేసుకుంటూ వెళ్లే వారు కరువయ్యారు. గోవిందనామ స్మరణ మరచి సెల్ఫీలు తీసుకుంటూ.. విడివిడిగా కొందరు, ఒంటరిగా మరి కొందరు వెళ్లి రావడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. సరైన దారిలోనే వెళ్లాలని, పక్కకు వెళ్లడానికి ప్రయత్నించ వద్దని అటవీ అధి కారులు సూచిస్తున్నా కొందరు పెడచెవిన పెడుతున్నారు. మరుగుదొడ్డికి అయినా ఏర్పాటు చేసిన ప్రాంతంలోనే వెళ్లాలని స్పష్టంగా చెబుతున్నా, కొందరు విడిగా అడవిలోకి ప్రవేశించి ప్రమాదాల బారిన పడుతున్నారు.

డేంజర్ జోన్లు ఇవే..!

తిరుమల కాలినడక మార్గంలో డేంజర్ జోన్లుగా కొన్ని ప్రాంతాలను టీటీడీ గుర్తించింది. ముందుగా 250వ మెట్టు వద్ద మైసూరు గోపురం, 2,083వ మెట్టు వద్ద మూడో గాలి గోపురం వస్తుంది. అక్కడి నుంచి కొండపైకి వెళ్లే నడకదారి మైదాన ప్రాంతంలా ఉంటుంది. తర్వాత ఏడో మైలు వద్ద ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహం ఉన్న ప్రాంతం. అలాగే కొద్ది దూరంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు వెళ్లే మార్గాన్ని డేంజర్ జోన్‌గా టీటీడీ ప్రకటించింది.

క్రూర మృగాలు ఎందుకొస్తున్నాయంటే..

చిన్నారులపై దాడితో మెట్ల మార్గంలోకి చిరుతలు, ఎలుగుబంటి, ఇతర జంతువులు ఎందుకొస్తున్నాయనే చర్చ మరోసారి తెరపైకి వచ్చింది. తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లే మెట్ల మార్గంలోకి తరచూ చిరుతలు రావడానికి అనేక కారణాలున్నాయని అటవీ అధికారులు చెబుతున్నారు. తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లాలంటే..అలిపిరి మెట్ల మార్గమైనా, శ్రీవారిమెట్టు మార్గమైనా మొదటి నుంచి చివరి వరకూ అడవే. రిజర్వు ఫారెస్టు కావడంతో శేషాచలంలో వన్యప్రాణులు ఎక్కువగానే ఉంటాయి. కరోనా లాక్‌డౌన్ సమయంలో నెలల తరబడి చడీచప్పుడు లేకపోవడంతో జంతువులు.. మెట్లమార్గంలోనూ, ఘాట్ రోడ్లలోనూ స్వేచ్ఛగా సంచరించడం మొదలుపెట్టాయి. అందుకే కరోనా తర్వాత చిరుతలు, ఎలుగుబంట్ల సంచారంపై తరచూ వార్తలొచ్చాయి. కాలినడక మార్గంలో దారి పొడుగునా దుకాణాలు ఉన్నాయి. షాపుల నిర్వాహకులు వ్యర్థాలను, యాత్రికులు ఆహార పదార్థాలను అడవిలో పడేయడం వల్ల తినేందుకు జింకలు, దుప్పిలు తదితర సాధు జంతువులు వస్తున్నాయి. ఆయా ప్రాణుల కోసం చిరుతలు వస్తుంటాయని అధికారులు చెబుతున్నారు.

చిరుతలు దాడికి సాహసించవు

సాధారణంగా చిరుతలు మనుషులపై దాడి చేయవని అటవీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. చిన్నారి లక్షిత నడకదారి నుంచి పక్కకు వెళ్లడంతో ఏదో జంతువుగా పొరబడి చిరుత దాడి చేసి ఉండొచ్చని అభిప్రాయపడుతున్నారు. శబ్దాలు చేస్తూ మెట్లపై నడిచే మనుషుల జోలికి చిరుతలు రావని తేల్చి చెప్పారు.

భద్రత కోసం చర్యలు

టీటీడీ రూ.వందల కోట్లు ఖర్చు చేసి నడక దారులను అద్భుతంగా నిర్మించింది. విశాలమైన మెట్లు, వాతావరణ ఇబ్బందులను తట్టుకునేలా పైకప్పును ఏర్పాటు చేసింది. రాత్రిపూట నడవడానికి కాంతివంతమైన విద్యుత్ దీపాలు అమర్చింది. చిరుతల జాడ కనిపించినపుడు బంధించి దూరంగా విడిచిపెట్టేందుకు చర్యలు చేపట్టింది. తాజా ఘటనల నేపథ్యంలో చిరుతల సంఖ్యను తెలుసుకోవడానికి 300 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయించింది. అలిపిరి మార్గంలో 70 మంది, శ్రీవారి మెట్టు దగ్గర 50 మంది గార్డులను పట్రోలింగ్‌కు నియమించింది.

చేతి కర్ర వెనుక కారణం ఇదీ

నడక మార్గంలో తిరుమలకు వెళ్లే భక్తుల తక్షణ రక్షణ కోసం చేతికర్ర ఇవ్వాలని నిర్ణయించినట్లు టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. భక్తులకు చేతికర్ర ఇవ్వడం వెనుక ఓ శాస్త్రీయ కారణం ఉందని నిపుణులు చెబుతున్నారు. చిరుతల దాడి మిగతా వన్యమృగాలకు భిన్నంగా ఉంటుంది. ప్రాణి ఎత్తును లెక్క వేసుకుని చిరుతలు దాడి చేస్తుంటాయి. తక్కువ ఎత్తు ఉండే ప్రాణులపైనే దాడి చేసేందుకే మొగ్గుచూపుతుంటాయి. ఎత్తుగా ఉండే ప్రాణులపై దాడికి తమ శక్తి సరిపోదని భావిస్తాయి. ఈ క్రమంలో మనిషి చేతి కర్రను పైకెత్తినప్పుడు అంత ఎత్తువరకు మనిషి ఉంటాడని లెక్కేసుకుంటాయి. అందుకే దాడికి భయపడి వెనక్కిపోతాయనేది ఓ కారణం. ఇదే విషయాన్ని అటవీ అధికారులు కూడా స్పష్టం చేస్తున్నారు. అందుకే టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చేతి కర్ర ఇవ్వాలని నిర్ణయం తీసుకుని ఉంటారని నిపుణులు చెబుతున్నారు.

చిరుతల కోసం నూతన బోన్లు



తిరుమల : కాలినడక మార్గంలో చిరుత సంచారం అధికమైన నేపథ్యంలో టీటీడీ అటవీశాఖ, ప్రభుత్వ అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ఆపరేషన్ చిరుత చేపట్టిన విషయం తెలిసిందే. అందులో భాగంగా అలిపిరి–తిరుమల మార్గంలో మరో ఆరు నూతన బోన్లు ఏర్పాటు చేశారు. మహారాష్ట్ర నుంచి తెప్పించిన ఈ బోన్లను చిరుత సంచరించే ప్రాంతాల్లో అమర్చారు. చిరుతలు, ఎలుగుబంట్లను పట్టుకుని భక్తులకు రక్షణ కల్పించేందుకు చర్యలు చేపట్టారు.

దుష్టభీతి తొలగుతుంది



ప్రతి ఒక్కరు గోవింద నామస్మరణ ద్వారా ముక్తిని పొందుతారు. మానవుడు ఏ జన్మలోఫలితాన్ని ఆ జన్మలోనే అనుభవిస్తాడు. నారాయణ నామ స్మరణ ద్వారా సకల పాపాలు నశించి ఉత్తమమైన జన్మ కలుగుతుంది. హరినామ స్మరణ ద్వారా మన శరీరంలో పవిత్రత ఏర్పడి, మనలో ఉండే దుష్టభీతి తొలగి ముక్తి లభిస్తుంది.

– గణేష్ స్వామి, కొల్హాపూర్ శ్రీమహాలక్ష్మీదేవి ఆలయ ప్రధాన అర్చకుడు

సరైన నిర్ణయం



గ్రామాల్లో ఒంటరిగా పొలానికి వెళ్లే రైతు చేతిలో కర్ర ఉంటుంది. ఆ సమయానికి రైతుకు అదే తోడు, రక్షణ. అటవీ ప్రాంతాల్లో సంచరించే గిరివాసులకు కర్ర బలమైన ఆయుధం. ఏనుగును మావటి నియంత్రించేది చేతికర్రలాంటి అంకుశంతోనే. కర్రలతో అలికిడి చేస్తే జంతువులు దూరంగా వెళ్లే అవకాశం ఉంటుంది. వృద్ధులకు ఎంతో సహాయకారిగా ఉంటుంది.


– సీహెచ్ భాస్కర్, ఎస్‌బీఐ మేనేజర్, సూర్యాపేట, తెలంగాణ

ఓల్డ్ ఈజ్ గోల్డ్



రక్షణ కోసం గతంలో చేతిలో కర్ర పట్టుకుని వెళ్లడం చూశాం. భక్తుల భద్రత దృష్ట్యా టీటీడీ చేతి కర్ర ఇస్తామని చెబుతోంది. ఓల్డ్ ఈజ్ గోల్డ్ అన్నట్టు మంచి నిర్ణయమే. మాకు కొత్త అనుభూతిగా మిగులుతుంది.

–భక్త బృందం, మూసాపేట, హైదరాబాద్



జనమంతా జగనన్న వెంటే

- బాబు మ్యానిఫెస్టో అబద్ధాల పుట్ట
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): జనమంతా ముఖ్యమంత్రి జనం వెంటే ఉన్నారని, సంక్షేమ పథకాల లబ్ధితో ఇంటింటా ఆనందం వెల్లివిరుస్తోందని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. పెనుమూరు మండలం రామాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్న చంద్రబాబునాయుడుపై తీవ్రంగా స్పందించారు. టీడీపీకి భవిష్యత్ లేదని తెలుసుకుని 'తిరుగుబాటు చేయండి, కేసులు పెట్టినా భయపడకుండా పోరాటం చేయండి' అంటూ పార్టీశ్రేణులను చంద్రబాబు రెచ్చగొట్టడం చూస్తుంటే ఆయనకు మతిభ్రమించినట్లు తెలుస్తోందని ఆరోపించారు. పేదరికాన్ని పోగొట్టేందుకు ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్ది ఆంగ్ల మాధ్యమాన్ని తీసుకొస్తే కోర్టుకెళ్లిన దుర్మార్గుడు చంద్రబాబు అని విమర్శించారు. ఆయన కుమారుడు మాత్రం లండన్‌లో చదువుకోవాలి, పేద పిల్లలు మాత్రం ఇంగ్లిష్ మీడియం చదివితే జీర్ణించుకోలేని బాబుకు ప్రజలను ఓటు అడిగే అర్హత లేదన్నారు. సంక్షేమ సారథి జగనన్నకు ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు జేజేలు కొడుతూ బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. జీడీనెల్లూరు నియోజకవర్గాన్ని దత్తతకు తీసుకుని రెండో పులివెందులుగా తీర్చి దిద్దుతున్నారని తెలిపారు.

పుంగనూరు ఘటనలో ఏ1 చంద్రబాబే

శాంతి భద్రతలు కాపాడే పోలీసు వ్యవస్థపై అవగాహన లేకుండా నోటికొచ్చినట్లు చంద్రబాబు మాట్లాడుతున్నారని నారాయణస్వామి ఆరోపించారు. పోలీసులకు వర్క్‌ఫ్రం హోమ్ అంటున్న బాబుకు దాని అర్థం కూడా తెలిసినట్లు లేదని ఆరోపించారు. చంద్రబాబు మేనిఫెస్టో అబద్ధాల పుట్టని, ప్రజలు బాబు మాటలు నమ్మేందుకు సిద్ధం లేరని పేర్కొన్నారు. పుంగనూరులో రౌడీ షీటర్లను ప్రేరేపించి, పోలీసులపై దాడులు చేయించిన చంద్రబాబును ఏ1 నిందితుడిగా అరెస్టు చేయాలన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై కక్ష సాధింపుతో బాబు తాను తవ్విన గోతిలో తానే పడ్డారని అన్నారు. చంద్రబాబుకు అధికారం అంటగడితే పిచ్చోడి చేతిలో రాయిలా మారుతుందన్నారు.

పకడ్బందీగా ఓటర్ల సర్వే



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఇంటింటి ఓటర్ల సర్వే కసరత్తు పకడ్బందీగా చేపడుతున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024 కసరత్తు పురోగతిపై శుక్రవారం సీఈవో ముఖేష్‌కుమార్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ షణ్మోహన్ జిల్లా పురోగతిని వివరించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో డోర్ టు డోర్ సర్వే ఇప్పటి వరకు 91.84 శాతం పూర్తి చేసినట్లు చెప్పారు. మూడు రోజుల్లో మిగిలిన కసరత్తు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. బీఎల్‌వో యాప్‌లో 66.87 శాతం, క్షేత్రస్థాయి పరిశీలన 26.78 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో 100 సంవత్సరాల పైబడిన ఓటర్లు 132 మంది ఉన్నట్లు చెప్పారు. ఫారం 6,7,8 ఆఫ్‌లైన్, ఆన్‌లోన్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్లు వివరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్‌వో రాజశేఖర్, ఏవో కులశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పను దర్శించుకున్న మంత్రి పెద్దిరెడ్డి



శబరిమల నుంచి ప్రయాణమైన మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: కేరళ రాష్ట్రంలోని శబరిమల అయ్యప్పస్వామిని శుక్రవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్ దర్శించుకున్నారు. పంపా నుంచి ఇరుముడులతో పాదయాత్రగా శబరిమల వెళ్లారు. అయ్యప్పస్వామి దర్శనానంతరం చిత్తూరుకు బయలుదేరారు. వారి వెంట ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, ఎంపీపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపినాథ్ తదితరులు ఉన్నారు.

80 శాతం సబ్సిడీతో ఉలవల పంపిణీ

చిత్తూరు అగ్రికల్చర్: ఈ ఖరీఫ్ సీజన్‌లో ఉలవ సాగుకు ప్రభుత్వం రాయితీపై అందజేస్తోందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా పలు ప్రాంతాల్లో వేరుశనగ సాగు తగ్గిందన్నారు. ప్రత్యామ్నాయంగా ఉలవ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తోందన్నారు. 5,900 క్వింటాళ్ల ఉలవలను ప్రభుత్వం జిల్లాకు కేటాయించినట్లు చెప్పారు. క్వింటాల్ ఉలవల ధర రూ.10,800 కాగా, 80 శాతం రాయితీపై రైతులకు క్వింటాళ్లు రూ.2,160కు విక్రయించనున్నట్లు చెప్పారు. ఇందుకుగాను ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ఈనెల 21 నుంచి ఉలవలు కావాల్సిన రైతులు పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. పేర్లు నమోదు చేసుకున్న రైతులకు వారం రోజుల్లో ఉలవలు అందిస్తామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

పోక్సో కేసులో యావజ్జీవం, జరిమానా

గూడూరురూరల్ : గూడూరు రెండవ పట్టణ పరిధిలో ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష పడింది. సీఐ వెంకటేశ్వరరావు కథనం మేరకు రెండవ పట్టణ పరిధిలోని గాంధీనగర్ ప్రాంతానికి చెందిన మైనర్ బాలికను ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో అదే ప్రాంతానికి చెందిన కత్తి రమణయ్య లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయంపై బాలిక తల్లి జనవరి 14న రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. కేసు తుది విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ తీర్పు ఇచ్చినట్లు సీఐ తెలిపారు.

ఉద్యోగుల సమస్యలకు ప్రాధాన్యం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఉద్యోగుల స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సమస్యల అర్జీలను కలెక్టర్‌కు అందజేశారు. అర్జీలను పరిశీలించి త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉద్యోగుల స్పందనను వివిధ శాఖల ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 12 అర్జీలు వచ్చాయని అధికారులు వెల్లడించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఆర్‌బీకేల్లో క్రిమిసంహారక మందులు
- జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో చైర్మన్ రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ రామచంద్రారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో నగరి, పలమనేరులో అగ్రికల్చరల్ ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు తెలిపారు. త్వరలో ప్రభుత్వం జిల్లాలో మరికొన్ని ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకు రానుందని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు, క్రిమి సంహారక మందుల నిల్వలు ఉంచాలని, అందుకు అవసరమైన ఇండెంట్‌లను సిద్ధం చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పలు పల్ప్ పరిశ్రమలలో వస్తున్న వేస్ట్‌ను బృందావనాలకు తరలించి సంపదను తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఆ విధానంతో పంచాయతీలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నట్లు చెప్పారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ఈ క్రాప్ బుకింగ్ నూతన జియో కోఆర్డినేటర్‌తో జరుగుతోందన్నారు. ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మామిడి కోత అనంతరం తీసుకోవాల్సిన యాజమాన్య చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సెరికల్చర్ జేడీ శోభ, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి ప్రభాకర్, ఏడీ మార్కెటింగ్ పరమేశ్వర్, ఎల్‌డీఎం హరీష్, సభ్యులు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, గోవర్ధన్ బాబి,శివ ప్రకాష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన గుర్రప్ప

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు సమీపంలో చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. మండల పరిధిలోని రామానాయుడు పల్లెకు చెందిన గుర్రప్ప(55) గంగాధరనెల్లూరు నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళుతున్నాడు. మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు సమీపంలో ఎదురుగా సైకిల్‌పై వస్తున్న వ్యక్తిని తప్పించబోయి ద్విచక్ర వాహనం అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో కిందపడిన గుర్రప్పకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఇంతకీ హతుడెవరు?

- సీసీ ఫుటేజీ ఆధారంగా విచారించినా లభ్యంకాని వివరాలు
- మార్చురీలో మృతదేహం



సీసీ ఫుటేజీలో కనిపిస్తున్న నిందితుడు (కుడివైపు), ఎడమవైపు హతుడు(ఇన్‌సెట్)

పలమనేరు: పట్టణ సమీపంలోని హైవేలో కోర్టుకు ఎదురుగా ఓ 25 ఏళ్ల యువకుడు గురువారం రాత్రి హత్యకు గురైన యువకుడి ఆచూకీ లభించలేదు. నిందితుడు అత్యంత కిరాతకంగా తలపై బండరాయితో కొట్టి చంపాడు. ముఖం ఏమాత్రం గుర్తుపట్టని విధంగా మారింది. హత్యకు పాల్పడిన నిందితుడు స్థానిక సిల్క్‌ఫాంకు చెందిన మురళి(16)గా పోలీసులు నిర్ధారించారు. అయితే హతుని వివరాలు మాత్రం రెండ్రోజులైనా తెలియరాలేదు. దీంతో పోలీసులు శుక్రవారం పట్టణంలోని పలు వీధుల్లోని సీసీ కెమరా ఫుటేజీలను పరిశీలించారు. స్థానిక రాధాబంగ్లా వీధిలోని మద్యం దుకాణం వద్ద నిందితుడు, హతుడు కలసి గురువారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఉన్న ఫుటేజీలు లభించాయి. ఈ ఆధారం తప్పా ఇంకేమి లేదు. రెండ్రోజులుగా చుట్టుపక్కల పోలీసు స్టేషన్లలోనూ మిస్సింగ్ కేసులు నమోదు కాలేదు. ఇలా ఉండగా నిందితుడు కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో తాపీపనులు చేస్తూ నాలుగు రోజుల క్రితమే పలమనేరుకొచ్చాడు. పలమనేరుకు సరిహద్దుగా ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని నంగళి, ముళబాగిలు పరిధిలోని గ్రామాలకు చెందిన వ్యక్తులు ఎక్కువగా బెంగళూరులో ఇదే పనుల్లో ఉన్నారు. సరిహద్దు గ్రామాలకు ఇక్కడి విషయాలు తెలియని పరిస్థితి ఉంది. దీంతో సరిహద్దు పోలీసు స్టేషన్లకు సైతం ఇక్కడ లభ్యమైన సీసీ టీవీ ఫుటేజీలను పంపుతున్నట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం దాకా వేచి చూసి ఆపై పోస్టుమార్టం నిర్వహించి శవాన్ని ఖననం చేయనున్నట్లు పేర్కొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

చిత్తూరు రూరల్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నీటి సమస్య రాకుండా తగు చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ తెలిపారు. చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. గురువారం రాత్రి ఆస్పత్రిలో నీటి సమస్య తలెత్తిందన్నారు. వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం నగరపాలక సంస్థ ద్వారా ఆస్పత్రికి నీటి సరఫరా జరుగుతోందన్నారు. త్వరలో ఆస్పత్రి ఆవరణలో బోరు డ్రిల్ చేయనున్నామని, భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా చూస్తామని ఆయన స్పష్టం చేశారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,460

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.79.00

చిత్తూరులో మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ నటి కాజల్

చిత్తూరు రూరల్: చిత్తూరు హైరోడ్డులో మాంగళ్య షాపింగ్ మాల్‌ను సినీ నటి కాజల్ అగర్వాల్ శుక్రవారం ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలనతో మాల్‌ను ప్రారంభించి..సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మాంగళ్య పూర్తిగా ఫ్యామిలీ షాపింగ్ మాల్ అని అన్నారు. తాను పదేళ్లుగా సందర్శిస్తున్నానని చెప్పారు. ఇక్కడి వస్త్రాలు తనకు బాగు నచ్చుతాయన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్దదైన మాంగళ్య షాపింగ్‌మాల్ 16వ బ్రాంచ్‌ని చిత్తూరులో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి మాట్లాడుతూ ఫ్యాషన్ వస్త్రాలకు మాంగళ్య మాల్ ప్రసిద్ధి చెందిందన్నారు. మేయర్ అముద మాట్లాడుతూ కంచి, ధర్మవరం పట్టు, ఫ్యాషన్ వస్త్రాలు మాంగళ్యలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు కాసం నమశ్శివాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్, పుల్లూరు వరుణ్, పుల్లూరు విశాల్, తోపుదునూరి కార్తీక్, తోడుపునూరి అరుణ్, కాసం ఫణీత్, కాసం సాయికృష్ణ, కార్పొరేటర్లు హరిణిరెడ్డి, జ్ఞానజగదీష్ తదిత రులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభానికి బాలాలయం ఏర్పాటు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో ధ్వజస్తంభానికి శుక్రవారం శాస్త్రోక్తంగా బాలాలయం ఏర్పాటు చేశారు. ఆలయంలోని ధ్వజస్తంభానికి రాగిరేకులను తొడిగేందుకు బాలాలయం నిర్మించారు. అందులో చిన్న ధ్వజస్తంభం ఏర్పాటు చేసి అర్చక, వేదపండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, కలశ పూజ, హోమాలు నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, ఏఈఓ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి



మృతదేహం కోసం గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది(ఇన్‌సెట్) మృతి చెందిన చరణ్

కుప్పంరూరల్: ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన కుప్పం మండలం పెద్దబంగారునత్తంలో శుక్రవారం చోటు చేసుకుంది. కుప్పం పోలీసుల కథనం మేరకు.. కుప్పం పట్టణం హెచ్‌పీ రోడ్డుకు చెందిన మురళి కుమారుడు చరణ్ (24), తన చిన్నాన్న కుమార్తెలతో కలిసి దేవాలయానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో పెద్దబంగారునత్తంలో స్నానం చేసేందుకు చెరువులో దిగారు. స్నానం చేస్తూ చరణ్ జారుకుని లోతులోకి వెళ్లిపోయాడు. తనకు తోడుగా ఇద్దరు అమ్మాయిలు మాత్రమే ఉండడంతో చరణ్‌ను రక్షించేవారు లేక నీటిలో మునిగిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చెరువు వద్దకు చేరుకున్నారు. గంటపాటు గాలించి సాయంత్రం చరణ్ మృతదేహాన్ని బయటికి తీశారు. అప్పటికే చెరువు వద్దకు చేరుకున్న బంధువులు, కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి. కుప్పం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రుల నిర్లక్ష్యం..

- ఒంటరిగా చిన్నారి అవస్థలు
- పోలీసుల జోక్యంతో సుఖాంతం



స్టేషన్‌లో తండ్రితో చిన్నారి

పుత్తూరు రూరల్: తల్లిదండ్రుల నిర్లక్ష్యం కారణంగా నాలుగేళ్ల చిన్నారి కొన్ని గంటల పాటు ఒంటరిగా ఇబ్బంది పడిన ఘటన వడమాలపేట మండలం అంజేరమ్మ ఆలయం వద్ద చోటు చేసుకొంది. ఎస్‌ఐ రామాంజనేయులు కథనం మేరకు .. శుక్రవారం ఉదయం తిరుపతి పట్టణం ప్రకాశం రోడ్డుకు చెందిన నాగేంద్ర, ఆదిలక్ష్మి దంపతులు కుమార్తె కీర్తి(4)తో కలిసి అంజేరమ్మ ఆలయానికి వచ్చారు. ఆలయంలో పూజలు నిర్వహించారు. అదే ఆలయానికి వచ్చిన బంధువులతో ముచ్చటించారు. వారితో పాప వస్తుందిలే అని అక్కడి నుంచి వెళ్లిపోయారు. మధ్యాహ్నం అయినా పాప ఇంటికి రాకపోవడంతో ముందుగా బంధువులుకు ఫోన్ చేశారు. వారు తాము తీసుకురాలేదని చెప్పడంతో, కంగారు పడి వడమాలపేట పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ సిబ్బందిని ఆలయం వద్దకు పంపడంతో, అక్కడే ఏడుస్తూ కనిపించిన పాపను విచారించారు. పాప తల్లిదండ్రుల పేర్లు చెప్పడంతో స్టేషన్‌కు తీసుకొచ్చారు. తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకోవడంతో పాపను అప్పగించారు. పిల్లల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు.

ముగ్గురు బిడ్డల సహా తల్లి ఆత్మహత్యాయత్నం

- ఆస్పత్రికి తరలింపు



చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉమామహేశ్వరీ, చిన్నారి

గంగాధరనెల్లూరు: తల్లీబిడ్డలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండల పరిధిలోని చిన్నదామరగుంట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చంద్రశేఖర్‌రెడ్డి భార్య ఉమామహేశ్వరీ వలంటీర్‌గా పని చేస్తోంది. చంద్రశేఖర్ టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం భార్యా భర్తలు గొడవ పడ్డారు. భర్త బయటకు వెళ్లగానే మనస్తాపానికి గురైన ఉమామహేశ్వరీ ముగ్గురు పిల్లలైన దీక్షిత(7),ధనుష్(7), శశి(5)తో కలసి ఇంటి తలుపులు మూసి వేసింది. పురుగుల మందును మొదట పిల్లలకు తాగించి అనంతరం ఆమె కూడా తాగింది. పెద్ద కుమార్తె దీక్షిత గట్టిగ కేకలు వేసుకుంటూ తలుపు తీసి బయటకు రావడంతో గుర్తించిన స్థానికులు వెంటనే నలుగురినీ చిత్తూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారు చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ రామాంజనేయులును వివరణ కోరగా ఆత్మహత్యాయత్నంపై తమకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో తిరుపతి వాసి మృతి



మృతిచెందిన బాలాజీ కుమార్

పలమనేరు: పట్టణ సమీపంలోని చైన్నె–బెంగళూరు జాతీయ రహదారిలో నాగమంగళం ఫ్లైఓవర్‌పై శుక్రవారం ఉదయం బైక్ అదుపుతప్పిన ప్రమాదంలో తిరుపతికి చెందిన ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. తిరుపతికి చెందిన బాలాజీ కుమార్(26) లండన్‌లో ఎంఎస్ చేసి ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి తిరుపతి నుంచి బెంగళూరుకు తన బుల్లెట్ వాహనంలో బయలుదేరాడు. పట్టణ సమీపంలోని నాగమంగళం ఫ్లైఓవర్ వద్ద బండి వేగంగా వెళుతుండగా అదుపుతప్పి కిందపడి మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో పలమనేరు పోలీసులు మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు తలకు హెల్మెట్, శరీరానికి జర్కిన్ ధరించి డ్రైవ్ చేస్తున్నప్పటికీ ఈ ప్రమాదంలో మృతిచెందాడు. ఫ్లైఓవర్‌ను సిమెంట్‌తో ఎగుడుదిగుడులుగా నిర్మించడంతోనే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

గాయపడిన వివాహిత మృతి

గంగవరం: మండలంలోని మార్జేపల్లెలో కారు ఢీకొన్న ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వివాహిత శుక్రవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని పసుపత్తూరు పంచాయతీ మార్జేపల్లెకు చెందిన శ్వేత(25)కు శాంతిపురం మండలం శివరామపురానికి చెందిన రాజుతో మూడేళ్ల కిందట వివాహమైంది. వారం రోజులు కింద పుట్టినిళ్ళు మార్జేపల్లికి ఇద్దరూ వచ్చారు. గత మంగళవారం ఉదయం ఇంటి నుంచి చెత్తబుట్ట తీసుకెళ్తుండగా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను బెంగళూరులోని ఒక ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుల అరెస్టు చూపుతున్న అధికారులు

కుప్పం: కుప్పం మండలం వెండుగంపల్లె వద్ద అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని ఎస్‌ఈబీ జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కుప్పం నుంచి కృష్ణగిరి మార్గంలో ద్విచక్ర వాహనంలో మద్యం తరలిస్తుండగా ఇద్దరిని అదుపులోకి తీసుకుని, 80 టెట్రా ప్యాకెట్స్, 47 సిల్వర్ కప్, 37 ఒరిజినల్ చాయిస్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కుప్పం మండలం పలార్లపల్లెకు చెందిన పురుషోత్తం, గజేంద్రను అరెస్టు చూపి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఈబీ డీటీఎఫ్ సీఐ మాధవస్వామి తెలిపారు.

అధ్యాపకుడు మందలించాడని విద్యార్థి అదృశ్యం



మునిరాజ(ఫైల్)

పుత్తూరు రూరల్: కాపీయింగ్ చేస్తుండగా అధ్యాపకుడు మందలించాడని ఓ విద్యార్థి కళాశాల నుంచి అదృశ్యమైన సంఘటన మండల కేంద్రమైన శుక్రవారం వడమాలపేటలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రామాంజనేయులు కథనం మేరకు...ఏర్పేడు మండలం చిన్నంపల్లెకు చెందిన మునిరత్నం కుమారుడు మునిరాజ (16) వడమాలపేట శ్రీనివాస ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. ఈనెల 17వ తేదీ గురువారం కళాశాలలో రివిజన్ ఎగ్జామ్ నిర్వహించారు. కాపీయింగ్ చేస్తున్న మునిరాజును అధ్యాపకుడు మందలించాడు. దీంతో అదే రోజు మధ్యాహ్నం కళాశాల నుంచి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం అందించింది. ఇంటికి కూడా రాకపోవడంతో కుమారుడి కోసం తల్లిదండ్రులు పలుచోట్ల వెతికినా ఆచూకి తెలియలేదు. ఈ మేరకు విద్యార్థి తండ్రి మునిరత్నం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.